క్లుప్తంగా

జగన్‌తో నాయకుల భేటీ


జగన్‌తో ఎమ్మెల్యే తాటిపర్తి, ఇతర నాయకులు

యర్రగొండపాలెం: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో సోమవారం పలువురు స్థానిక నాయకులు సోమవారం భేటీ అయ్యారు. వాదంపల్లి సర్పంచ్, వైఎస్సార్ సీపీ మండల ఉపాధ్యక్షుడు పబ్బిశెట్టి శ్రీనివాసులు, ఏఎంసీ డైరెక్టర్లు కందుల సత్య నారాయణ చౌదరి, మొగిలి సుబ్బారావు, దోగిపర్తి సంతోష్ కుమార్‌లు జగనన్నతో కలిసి నందుకు ఆనందాన్ని వ్యక్త పరిచారు.


వైఎస్ జగన్‌తో ఎస్సీసెల్ కన్వీనర్ ప్రసాద్

పుల్లలచెరువు: రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని సోమవారం తాడేపల్లి కార్యాలయంలో వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ మండల కన్వీనర్ ఎల్.ప్రసాద్ కలిశారు. ప్రసాద్‌ను యర్రగొండపాలెం శాసనసభ్యుడు తాటిపర్తి చంద్రశేఖర్ పరిచయం చేశారు. ప్రసాద్ మండలంలోని పలు సమస్యలను మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వివరించారు.

హ్యూమన్ రైట్స్ జిల్లా అధ్యక్షుడిగా జబీవుల్లా


జబీవుల్లాకు గుర్తింపు పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే తాటిపర్తి

యర్రగొండపాలెం: ఆల్ ఇండియా హ్యూమన్ రైట్స్ ముస్లిం మైనార్టీ జిల్లా అధ్యక్షుడిగా సయ్యద్ జబీవుల్లాను ఆ సంస్థ నేషనల్ డైరెక్టర్ డాక్టర్ సురేష్‌కుమార్ నియమించారు. ఈ మేరకు సోమవారం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ ఆయనకు గుర్తింపు పత్రాన్ని అందజేసి అభినందించారు.

బాలికలకు ఆటల పోటీలు


కేజీబీవీలో చదరంగం ఆడుతున్న బాలికలు

పెద్దారవీడు: జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా సోమవారం గ్రంథపాలకుడు ఏర్వ వెంకటేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో ఆటల పోటీలు నిర్వహించారు. వ్యాసరచన, స్కిపింగ్, చెస్, రింగ్‌బాల్ ఆటలు ఆడించారు. ఆయన మాట్లాడుతూ గ్రంథాలయాలను బాలికలు ఉపయోగించుకోవాలని, పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలని చెప్పారు. గ్రంథాలయంలో సభ్యత్వం తీసుకొని వివిధ రకాల పుస్తకాలు చదివి విజ్ఞానవంతులు కావాలని, రాబోయే తరానికి మార్గదర్శకులు కావాలని కోరారు. ఈ సందర్భంగా 10 మంది బాలికలు పుస్తకాల కోసం సభ్యత్వం తీసుకున్నారని తెలిపారు. ప్రత్యేకాధికారి పీబీ పాల్గొన్నారు.

ఎరువుల దుకాణం ఆకస్మిక తనిఖీ


ఎరువుల దుకాణం తనిఖీ చేస్తున్న ప్రసాద్‌రావు

తాళ్లూరు: మండలంలోని తూర్పు గంగవరంలో ఎరువుల దుకాణాలను అధికారులు సోమవారం అకస్మికంగా తనిఖీ చేశారు. ఏఓ ప్రసాదరావు ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించి మాట్లాడారు. ఎరువుల నాణ్యతలు పరిశీలించి సకాలంలో రైతులకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. యూరియా, డీఏపీ రెండు శాంపిళ్లను తీసుకుని రీజనల్ కోడింగ్ సెంటర్ అమరావతికి పంపినట్లు తెలిపారు. వచ్చిన రిపోర్టు ఆధారంగా తగు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఏఈఓ నాగరాజు పాల్గొన్నారు.

కేబుల్ వైర్, పైపులు చోరీ

పెద్దారవీడు: మండలంలోని మద్దలకట్ట గ్రామానికి చెందిన రైతు దొడ్డ వెంకటరామిరెడ్డి పొలంలో బోరుకు సంబంధించిన కేబుల్ వైర్, ఇనుము పైపులు ఆదివారం రాత్రి చోరీ అయ్యాయి. బాధిత రైతు కథనం ప్రకారం.. ఆదివారం మోటారు కాలిపోవడంతో మరమ్మతులు చేయడం కోసం ట్రాక్టర్ మిషన్ సాయంతో పైపులు, కేబుల్ వైరును బయటకు తీశారు. కేబుల్ వైరు, పైపులు పొలంలోనే ఉంచి కాలిపోయిన మోటారును మెకానిక్ వద్దకు తీసుకెళ్లారు. సోమవారం ఉదయం పొలం దగ్గరకు వెళ్లి చూడగా 400 మీటర్ల కేబుల్ వైరు, 20 అడుగులు 6 పైపులు కనిపించలేదు. వాటి విలువ దాదాపు రూ.70 వేలు ఉంటుందని బాధిత రైతు తెలిపాడు.

దయనీయంగా సంక్షేమ హాస్టళ్లు

- బాత్‌రూమ్‌లు లేక విద్యార్థుల అవస్థలు

దర్శి: దర్శి నియోజకవర్గంలో సంక్షేమ హాస్టళ్ల దుస్థితి దయనీయంగా ఉంది. ప్రధానంగా సరిపడా బాత్‌రూమ్‌లు లేక.. ఉన్న బాత్‌రూమ్‌లు అపరిశుభ్రంగా ఉండటంతో విద్యార్థులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. విద్యార్థులకు ఇవ్వాల్సిన దుప్పట్లు, దుస్తులు, కాస్మొటిక్స్ ఇప్పటికీ ఇవ్వలేదు. దర్శి పట్టణంలోని ఎస్సీ హాస్టల్లో విద్యార్థులకు వసతులు లేక నానా అవస్థలు పడుతున్నారు. రూమ్‌లు అపరిశుభ్రంగా మారి రాత్రులు దోమలు బెడదకు విలవిల్లాడుతున్నారు. వాచ్‌మెన్, కమాటి, వంటమాస్టర్ అన్నింటికీ ఒకే వ్యక్తి ఉన్నారు. విద్యార్థుల వసతులపై ఏఎస్‌డబ్ల్యూఓ పలుమార్లు తనిఖీలు చేసినా ప్రయోజనం లేదు. బీసీ హాస్టల్లో ప్రభుత్వ భవనంపై స్లాబు తరుచూ పెచ్చులూడి పోతోంది. పూర్తిస్థాయిలో బాత్‌రూమ్‌లు సరిపడా లేవు. ఫ్యాన్‌లు పూర్తి స్థాయిలో లేవు. లంకోజనపల్లి రోడ్డులోని ఎస్సీ బాలికల హాస్టల్లో ప్రభుత్వ భవనం పెచ్చులూడి పోతోంది. అక్కడే ఉన్న ఎస్సీ హాస్టల దుస్థితి మరింత దయనీయంగా ఉంది. బాలికలు, బాలుర హాస్టళ్లకు ఒకే వంట మాస్టర్ ఉన్నారు. వాచ్‌మెన్‌లు, ఇతర సిబ్బంది లేరు.

దొనకొండలో..

బీసీ బాలుర వసతి గృహంలో విద్యార్థులకు ప్రహరీ లేదు. దీంతో విద్యార్థులు రోడ్డుపైకి రావడం జరుగుతోంది.

కురిచేడులో..

కురిచేడు: విద్యార్థుల భవితవ్యం నిర్ణయించే సంక్షేమ హాస్టళ్ల సమస్యల సుడిగుండంలో కొట్టుమిట్టాడుతున్నాయి. స్థానికంగా బీసీ, ఎస్సీ హాస్టళ్ల 50 ఏళ్లుగా ప్రభుత్వం నిర్వహిస్తోంది. 20 ఏళ్ల క్రితం అప్పటి సర్పంచ్ ఆవుల లక్ష్మి వెంకటరెడ్డి బీసీ హాస్టల్‌కు సొంత భవనాన్ని ప్రభుత్వం ద్వారా నిర్మించారు. అప్పటి నుంచి ఆ హాస్టల్‌కు ప్రహరీ లేకపోవటంతో చుట్టూ కంపచెట్లు ఉండటంతో పాములు సంచరిస్తున్నాయి. హాస్టల్ భవనం కూడా మధ్యలో ఖాళీ ఉంచి యూ ఆకారంలో గదులు నిర్మించటంతో చిన్నపాటి వర్షానికి కూడా గదుల్లోకి వానజల్లు చేరి విద్యార్థులకు ఇబ్బంది కలిగిస్తోంది. శ్లాబు పెచ్చులూడిపోతూ వర్షానికి కురుస్తోంది. బాత్‌రూమ్‌లకు తలుపులు కూడా లేవు. ఈ ఏడాది విద్యార్థులకు బెడ్‌షీట్లు, నోటుపుస్తకాలు, కాస్మొటిక్స్ లాంటివి ప్రభుత్వం సరఫరా చేయలేదు. పాతవాటిని చొట్టలు తీసి లాకులు లేకపోయినా విద్యార్థులకు పెట్టెలను వార్డెన్లు, సిబ్బంది ఇస్తున్నారు. దుప్పట్లు పాత విద్యార్థుల వద్ద వెనక్కు తీసుకుని తిరిగి కొత్తవారికి అందజేస్తున్నారు. ఎస్సీ హాస్టల్ నేటికి అద్దె భవనంలో నిర్వహిస్తున్నారు. అరకొర వసతులతో ఉన్న భవనాలను మాత్రమే హాస్టళ్లకు అద్దెకు ఇస్తున్నారు. దానికి ప్రభుత్వం సొంత భవనం నిర్మాణం చేస్తే విద్యార్థులకు ఉపయుక్తంగా ఉంటుంది. ఒక వైపు అరకొర వసతులతో విద్యార్థులు నానా ఇబ్బందులు పడుతున్నారు. అయితే వారికి నిత్యం అవసరమైన నిత్యావసర వస్తువులు, కూరగాయలు, పాలు కొనుగోలుకు బిల్లులు చెల్లించక పోవడంతో వార్డెన్లు ఇబ్బంది పడుతున్నారు. రేషన్ షాపుల ద్వారా బియ్యం, కందిపప్పు సరఫరా చేస్తే నూనె, వెచ్చాలు తదితరాలకు వార్డెన్లు అప్పులు చేసి నిర్వహిస్తున్నారు. 16 నెలలుగా బిల్లులు రాకపోవడంతో షాపుల్లో కూడా అప్పులు ఇవ్వడం లేదని వార్డెన్లు వాపోతున్నారు. ప్రభుత్వం సంక్షేమ హాస్టళ్లలోని సమస్యలకు పరిష్కార చర్యలతో పాటు బిల్లులు వెంటనే చెల్లించాలని విద్యార్థులు, వార్డెన్లు కోరుతున్నారు.

ఉపయోగపడని బాలికల వసతి గృహం

పెద్దారవీడు: విద్యాశాఖ అధికారుల నిర్లక్ష్యం, ప్రజా ప్రతినిధుల పట్టింపులేని తనం ఫలితంగా భారీ వ్యయంతో నిర్మించిన బాలికల వసతి గృహం నిరుపయోగంగా దర్శమిస్తోంది. మండలంలో ఏనుగుదిన్నెపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అవరణంలో ఆర్ఎంఎస్ఏ ఫేజ్-5 రూ.194.21 లక్షల నిధులతో బాలికల వసతి గహం నిర్మాణం పూర్తి చేశారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో 2023 ఫిబ్రవరి నెల 1వ తేదీన అప్పటి పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ చేతుల మీదుగా బాలికల వసతి గృహం ప్రారంభించారు. దాదాపు 21 నెలలు దాటినా బాలికల వసతి గృహం వినియోగంలోకి రాకపోవడంతో స్థానికులు, ఉపాధ్యాయుల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పాఠశాలలో 3వ తరగతి నుంచి 10వ తరగతి వరకు మొత్తం 511 మంది విద్యార్థులు ఉండగా వారిలో బాలికలు 215 మంది, బాలురు 296 మంది చదువుతున్నారు. గ్రామంలో ఎస్సీ బాలుర హాస్టల్ అద్దె భవనంలో నిర్వహిస్తున్నారు. ప్రగళ్లపాడు, బద్వీడు, రేగుమానిపల్లి, పాతంపల్లి, కగ్రోల, చట్లమిట్ల, రాజంపల్లి, గంగుపల్లి, బట్టువారిపల్లి గ్రామాల నుంచి బాలికలు చదువుకునేందుకు కాలినడకతో పాఠశాలకు వస్తుంటారు. ఒక్కో గ్రామం నుంచి పాఠశాలకు వచ్చి పోవాలంటే దాదాపు మూడు నుంచి ఐదు కిలోమీటర్ల దూరం ఉంటుంది. రోజూ బాలికలు నడుచుకుంటూ పాఠశాలకు రాను పోను తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని బాలికలు ఆవేదన వ్యక్తం చేశారు. ఉదయం ఇంటి నుంచి హుషారుగా పాఠశాలకు వచ్చే బాలికలు సాయంత్రం నడుచుకుంటూ నీరసంగా ఇళ్లకు వెళ్తూ కనిపించారు. బాలికల కోసం నిర్మించిన వసతి భవనంలో ప్రవేశానికి ఈ ఏడాది బాలికల నుంచి దరఖాస్తులు అహ్వానించక పోవడంతో తల్లిదండ్రులు అగ్రహం చెందుతున్నారు. అధికారులు, పాలకుల నిర్లక్ష్యానికి బాలికలు రోజూ పాఠశాలకు రాక పోకలకు అవస్థలు పడుతున్నారు. వసతి గృహం వినియోగంలోకి వచ్చి ఉంటే దాదాపు 100 మంది వరకు బాలికలు పాఠశాలలో చేరే వారని ఉపాధ్యాయులు చెబుతున్నారు. దీంతో పాఠశాలకు వచ్చిన తల్లిదండ్రులు వసతి గృహం వినియోగంలో ఉందా.. అని అడుగుతున్నారు. ఇంకా ప్రభుత్వం నుంచి అనుమతి రాలేదని చెప్పడంతో బాలికలు చేరకుండా వెళ్లిపోతున్నారు. వసతి గృహం అవరణంలో దాదాపు 10 అడుగుల లోతులో రెండు గుంతలకు సిమెంటు రింగులు వేశారు. కానీ వాటికి మూతలు వేయకుండా కంట్రాక్టర్ వదిలేశారు. ఆటలు ఆడుకునే సమయంలో గుంతల్లో పడి గాయాలైన సంఘటనలు ఎన్నో ఉన్నాయని విద్యార్థులు వాపోతున్నారు. బాలికల వసతి కోసం నిర్మించి భవనం చుట్టూ పిచ్చి మొక్కలు, అపరిశుభ్రతతో దర్శమిస్తోంది. అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారందని స్థానికులు చెబుతున్నారు. అసంపూర్తిగా ఉన్న పనులు పూర్తి చేయాలని, వినియోగంలోకి వచ్చే అవకాశం ఉన్న బాలికల వసతి భవనం దుస్థితి ఎవరికీ పట్టడం లేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు నిరుపేదల బాలికల కోసం ఏర్పాటు చేసిన భవనంను వినియోగంలోకి తీసుకొని రావాలని బాలికల తల్లిదండ్రులు కోరుతున్నారు.


కురిచేడులో తలుపులు లేని బాత్‌రూమ్‌లు


కురిచేడులో స్లాబు పగిలి వస్తున్న నీటి తేమ

సాక్షి గ్రాండ్ రిపోర్ట్

వసతి గృహం వినియోగంలోకి తీసుకురావాలి:



ప్రభుత్వ బాలికల వసతి గృహం వినియోగంలోకి తీసుకురావాలి. మూతపడటంతో పేద బాలికలు తీవ్రంగా నష్టపోతున్నారు. పాఠశాల ఆవరణంలో నిర్మించిన వసతి గృహం వినియోగంలోకి తీసుకుని తేస్తే మాలాంటి బాలికలు చేరే అవకాశం ఉంటుంది. వసతి గృహంలో ఉపాధ్యాయులు ఉదయం, సాయంత్రం చదివించేవారు. ఉన్నతాధికారులు వసతి గృహం వినియోగంలోకి తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకురావాలి.

– దుద్దెల అంజలి, 10వ తరగతి, పాతంపల్లి


కురిచేడు: కంపచెట్ల మధ్య బీసీ హాస్టల్


కురిచేడు హాస్టల్లో విద్యుత్ బోర్డు దుస్థితి


పెద్దారవీడు: ఏనుగులదిన్నెపాడులో నిరుపయోగంగా బాలికల వసతి భవనం


బాలికల వసతి భవనం చుట్టూ పిచ్చిచెట్లు

మీ కోసం..ఎవరి కోసం?

కురిచేడు: ప్రతి సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల దినోత్సవం మీకోసం కార్యక్రమం నిర్వహిస్తారు. దానికి మండలంలోని అన్ని శాఖల అధికారులు హాజరై వారి శాఖకు సంబంధించిన సమస్యలపై ప్రజలు అర్జీలు ఇస్తే వాటిని పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటారు. వెంటనే పరిష్కారమయ్యే వాటిని అప్పటికప్పుడే చేయాలి, లేదంటే సమయం పట్టే సమస్యలకు నిర్ణీత గడువు చెప్పి పంపుతారు. ఆ కార్యక్రమానికి అధికారులు హాజరు కాకుండా దుమ్మా కొడుతున్నారంటే ఆ అధికారులకు విధులపట్ల ఎంత శ్రద్ధ ఉందో అర్థమవుతోంది. కొందరు అధికారులు వారి కార్యాలయంలోని సిబ్బందికి పంపి మమ అనిపిస్తున్నారు. సమస్యలు అడిగితే వాటికి సమాధానం చెప్పాల్సిన బాధ్యత గల అధికారులు రాకుండా కిందిస్థాయి సిబ్బంది సమస్యల పట్ల ఏం బాధ్యతగా సమాధానం చెబుతారనేది అందరికీ తెలిసిన విషయమే. అధికారులే హాజరు కాకపోతే ఇక తమ సమస్యలు పరిష్కరించేదెవరని మీ కోసం కార్యక్రమానికి మండల ప్రజలు దూరంగా ఉంటూ సమస్యలు ఉన్న వారు కలెక్టర్ నిర్వహించే మీకోసం కార్యక్రమానికి హాజరై తమ సమస్యలు వెల్లబోసుకుంటున్నారు. అంతే కాకుండా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న కార్యక్రమానికి అధికారులు రాకపోయినా, మొక్కుబడిగా నిర్వహిస్తున్నా పట్టించుకోని ప్రభుత్వ పెద్దలకు ప్రజాసమస్యల పట్ల ఎంత మక్కువో అర్థమవుతోంది. కింది స్థాయి అధికారులు, సిబ్బంది సక్రమంగా విధులు నిర్వహిస్తున్నారో? లేదో కూడా తెలుసుకోలేని స్థితిలో జిల్లా అధికార యంత్రాంగం ఉంది. పర్యవేక్షణ చేయాల్సిన అధికారులు కార్యాలయాలకే పరిమితం కావటంతో కింది స్థాయి అధికారులు వారి సొంత పనుల్లో బిజీ అయిపోతున్నారు. ప్రభుత్వం బయోమెట్రిక్, ఫేషియల్, ఐరిష్ ఇలాంటి ఎన్ని పెట్టినా అధికారుల్లో మాత్రం ఇసుమంతైనా మార్పురాలేదని ప్రజలు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా మండల స్థాయి అధికారుల పనితీరుపై జిల్లా అధికారుల పర్యవేక్షణ చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.


మీకోసం కార్యక్రమానికి హాజరైన ముగ్గురు అధికారులు

అర్హులకు ఇళ్లు మంజూరు చేయాలి


సచివాలయం ఎదుట నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు

దర్శి: అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి మాడపాకుల రమేష్ డిమాండ్ చేశారు. నగర పంచాయతీ పరిధిలోని శివరాజనగర్‌లో ఐదో సచివాలయం పరిధిలో సీపీఐ, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని కోరుతూ సోమవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రమేష్‌బాబు మాట్లాడుతూ పేదలకు గ్రామాల్లో మూడు సెంట్లు, పట్టణాల్లో రెండు సెంట్లు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరారు. ఇంటి నిర్మాణాలకు రూ.ఐదు లక్షలు మంజూరు చేయాలని కోరారు. రాష్ట్ర నాయకుడు జూపల్లి కోటేశ్వరరావు మాట్లాడుతూ శాంతి నగర్‌లో ఇళ్లు లేక అనేక మంది అద్దె ఇళ్లలో జీవిస్తున్నారన్నారు. అనంతరం స్థలాల అర్జీలను సచివాలయం కార్యదర్శికి అందజేశారు. ఆర్.అంజమ్మ, పి.సంపూర్ణ, పి.అంజమ్మ, పి.లక్ష్మి, కె.నారాయణమ్మ, ఎస్‌కే కాశింబీ, మహేష్ పాల్గొన్నారు.

బాలల చట్టాలపై అవగాహన పెంచుకోవాలి


మాట్లాడుతున్న డీటీడబ్ల్యూఓ జగన్నాథరావు


పుల్లలచెరువు: మాట్లాడుతున్న ఎంపీడీవో వసంతరావునాయక్


పెద్దారవీడులో బహుమతులు అందిస్తున్న డీఎల్‌డీఓ ఝాన్సీరాణి


మాట్లాడుతన్న డిప్యూటీ సీఈఓ బాలమ్మ

దొనకొండ: ప్రతి ఒక్కరూ బాలల చట్టాలపై అవగాహన పెంచుకోవాలని జిల్లా పరిషత్ జెడ్పీ డిప్యూటీ సీఈఓ పి.బాలమ్మ పేర్కొన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు వీవీ రామాంజనేయులు అధ్యక్షతన సోమవారం బంగారు బాల్యం వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బంగారు బాల్యం వారోత్సవాల్లో భాగంగా బాలల హక్కులు, బాధ్యతలు, నిర్వహణ, చట్టాలపై అవగాహన కల్పించారు. ఎంపీపీ బొరిగొర్ల ఉషా మురళి మాట్లాడుతూ బాలల హక్కులు, బాధ్యతల గురించి తెలియజేశారు. బాగా చదువుకుని జీవితంలో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. తహసీల్దార్ బి.రమాదేవి మాట్లాడుతూ బాల్య వివాహాలు నేరమని, బాల్య వివాహాలతో ఆడ పిల్లలు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని, చాలామంది బాలికలకు చిన్న వయసులోనే వివాహాలు చేస్తే వారి జీవితాలను కోల్పోతున్నారని, బాల్య వివాహాలు చేస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు. అనంతరం బాలికలకు వ్యాస రచన పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. సర్పంచ్ కొంగలేటి గ్రేస్‌రత్న దేవానంద్, ఎంపీడీఓ ఎం.శ్రీదేవి, ఎంఈఓలు ఎన్.సాంబశివరావు, షేక్ అమీర్‌బాషా, వైద్యాధికారి ఎం.సునీత, పంచాయతీ కార్యదర్శి పి.కృష్ణమూర్తి పాల్గొన్నారు.

పెద్దారవీడు: బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని మార్కాపురం డీఎల్‌డీఓ ఝాన్సీ రాణి అన్నారు. పెద్దారవీడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బంగారు బాల్యంలో భాగంగా సోమవారం ఎంపీడీఓ జాన్‌సుందరం ఆధ్వర్యంలో మండల స్థాయి టాస్క్‌ఫోర్స్ కమిటీ పర్యవేక్షణలో విద్యార్థుల సమావేశం నిర్వహించారు. డీఎల్‌డీఓ మాట్లాడుతూ బాల్య వివాహాలు సమాజాభివృద్ధికి నిరోధకాలని, ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతున్నట్లు తెలిస్తే వెంటనే అధికారులకు తెలియజేయాలని విద్యార్థులను కోరారు. ఆడపిల్లల పట్ల అసభ్య ప్రవర్తన సరికాదని, బాల్యం నుంచే ఉపాధ్యాయులు నైతిక విలువలు నేర్పించాలన్నారు. తహసీల్దార్ శైలేంద్రకుమార్ మాట్లాడుతూ బాల కార్మికుల వ్యవస్థ నిర్మూలించాలని, చిన్నారులచే పనులు చేయించి వారిని పోత్సహిస్తున్న వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అనంతరం చిత్రకళ, వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అధికారులు ప్రదానం చేశారు. ఎంఈఓ 1, 2 పి.శ్రీనివాసులు, ఎస్‌వీసీహెచ్ సుబ్రహ్మణ్యం, ఈఓఆర్డీ రాజు, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జగదీష్,, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అంజమ్మ, ఏఎస్ఐ నాయక్, హెచ్‌ఎం కనకదుర్గ, సీఆర్పీ వీరయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

పుల్లలచెరువు: విద్యార్థులు క్రమశిక్షణ, అంకితభావంతో ఉన్నప్పుడే వారి జీవితాలు బంగారుమయం అవుతాయని ఎంపీడీవో వసంతరావు నాయక్ అన్నారు. సోమవారం బంగారు బాల్యం కార్యక్రమంలో భాగంగా ఎంఈవో ఇందిర అధ్యక్షతన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన, బాల్య వివాహ రహిత ప్రకాశం గురించి మండల స్థాయిలో వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఎంపీడీవో మాట్లాడుతూ బంగారుబాల్యం ఎంతో విలువైందని, ప్రతి విద్యార్థి క్రమశిక్షన, అంకితభావంతో ఉన్నప్పుడే జీవితాలను బంగారు మయం చేసుకోవచ్చని, దాని కోసం నిరంతరం కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఎంఈవో ఇందిర మాట్లాడుతూ బంగారుబాల్యం ఎంతో మరపురానిదని, దాన్ని సక్రమంగా తీర్చిదిద్దుకోవాలన్నారు. బాల్య వివాహాలు, బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించడం విద్యార్థులతోనే సాధ్యమవుతుందన్నారు. ఐసీడీఎస్ అధికారి శివలక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆటల పోటీలపై విద్యార్థులకు అవగాహన

పెద్దదోర్నాల: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం బంగారు బాల్యం మండల స్థాయి పోటీలను ఎంఈఓ మస్తాన్‌నాయక్ అధ్యక్షతన ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా గిరిజన సంక్షేమ అధికారి జగన్నాథరావు, ఎంపీడీఓ నాసర్‌రెడ్డి హాజరయ్యారు. అధికారులు విద్యార్థులకు మండలస్థాయి పోటీల నిర్వహణపై సూచనలు చేశారు. జగన్నాథరావు మాట్లాడుతూ బంగారు బాల్యం వారోత్సవాల్లో భాగంగా పాఠశాల స్థాయిలో విజేతలైన విద్యార్థులకు మండల స్థాయిలో పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బాల్య వివాహాలపై వ్యాసరచన, బంగారు బాల్యంపై వాక్చాతుర్య పోటీ, బాలల భద్రతపై చిత్రకళలు, స్నేహపూర్వక గ్రామం తదితర అంశాలపై పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రధానోపాధ్యాయుడు నారాయణరెడ్డి, ఏపీఎం పోలయ్య పాల్గొన్నారు.

దర్శి: విద్యార్థినులకు బాల్యంపై అవగాహన కలిగి ఉండాలని మండల ప్రత్యేకాధికారి టి.రవికుమార్ సూచించారు. మండలంలోని చందలూరు, బసిరెడ్డి పల్లె గ్రామాల్లో బంగారు బాల్యం కార్యక్రమం సోమవారం జరిగింది.

భక్తిశ్రద్ధలతో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి తిరునాళ్ల

కురిచేడు: స్థానిక శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి (యోగయ్య) స్వామి తిరునాళ్ల సోమవారం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ప్రతి సంవత్సరం కార్తీక బహుళ విదియనాడు స్వామివారికి తిరునాల నిర్వహిస్తారు. స్వామివారి చిత్రపటాన్ని గ్రామంలో ఆర్థ్ర నక్షత్రంలో గ్రామోత్సవం చేస్తారు. భక్తులు స్వామివారికి పొంగళ్ల నైవేద్యం చేసి నివేదించి మొక్కులు తీర్చుకున్నారు. పూర్వ కాలంలో స్వామివారు గ్రామంలోకి ఎలాంటి సమస్య రాకుండా కాపాడారని, కలరా లాంటి వ్యాధులు ప్రబలే సమయంలో స్వామివారి సమాధి నుంచి విభూది తీసుకెళ్లి గ్రామంలో చల్లితే ఎలాంటి వ్యాధులు ప్రబలేవి కాదని పెద్దలు చెబుతున్నారు. వర్షాలు సకాలంలో కురవక పోయినా స్వామివారి ఆలయంలో ఉన్న గుంతను నీటితో నింపి స్వామివారికి ప్రత్యేక పూజలు చేస్తే వర్షాలు కురిసి పంటలు బాగా పండేవని పెద్దలు చెబుతున్నారు. ఆ ఆచారాన్ని నేటికీ ప్రజలు నిర్వహిస్తున్నారు.


మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు

ఎంపీపీకి స్వల్ప గాయాలు

దొనకొండ: ఎంపీపీ బొరిగొర్ల ఉషామురళికి రోడ్డు ప్రమాదంలో స్వల్పంగా గాయాలయ్యాయి. ఈ సంఘటన స్థానిక బ్రహ్మరావుపేటలోని ఆంజనేయస్వామి గుడి వద్ద సోమవారం సాయంత్రం జరిగింది. వివరాలు.. ఎంపీపీ తన భర్త మురళీతో కలిసి సొంత వాహనంలో త్రిపురాంతకం వెళ్లి తిరిగి ఇంటికి వస్తున్నారు. స్థానికి బ్రహ్మరావుపేటలోని ఆంజనేయ స్వామి గుడి వద్ద కారు అదుపుతప్పి బలంగా దేవాలయ ప్రహరీని ఢీకొట్టింది. ఎంపీపీకి చేతి మణికట్టుకు గాయాలయ్యాయి. ఆమెను వినుకొండ తరలించారు.